క్లుప్తంగా

వేలం వాయిదా

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయ భూముల బహిరంగ వేలం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఆలయ ఈవో గర్రెపెల్లి వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న నిర్వహించాల్సిన బహిరంగ వేలం వాయిదా వేసినట్లు ప్రకటించారు. తదుపరి బహిరంగ వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు కౌటాల ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన కె.మహేశ్ ఇటీవల రూ.15 వేల విలువ గల సెల్‌ఫోన్‌ను కౌటాలలో పొగొట్టుకున్నారని తెలిపారు. సీఈఆర్ ద్వారా ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

కౌటాల: మండలంలోని కోయగూడలో సోమవారం నుంచి గ్రామ పంచాయతీస్థాయి ఆదివాసీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాజేశ్వర్, కోటేశ్వర్, శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7093389136, 6305174493, 9398895620 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగజ్‌నగర్, సిర్పూర్(టి), మంచిర్యాల, మహారాష్ట్రలోని అలెపల్లి, అహేరి ప్రాంతాల నుంచి వచ్చే హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ వేస్తామని తెలిపారు.

నిరుపేద మహిళకు చేయూత



సరుకులు అందజేస్తున్న సభ్యులు

బెజ్జూర్: ఎమ్మెల్సీ దండే విఠల్ యువజన సభ్యులు నిరుపేద మహిళకు చేయూతనందించారు. మండల కేంద్రంలోని బారెవడకు చెందిన లక్ష్మి తల్లి తారబాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ యువజన సభ్యులు ఆదివారం ఆమె నివాసానికి చేరుకుని పరామర్శించారు. నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో సామల రాజన్న, పెద్దల శంకర్, రంగు సురేష్‌గౌడ్, గుమ్ముల శ్రీను, పురం వైకుంఠం, గోగుసూరు తిరుపతి, క్రాంతి, వసంత్ శ్యాముల్, చెండే అరుణ్, మొర్లె మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

లింగాపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు పాఠశాలలో రెండు కంప్యూటర్లు, 12 బ్యాటరీలు 1 ఫింగర్ ప్రింట్ మిషన్ల ఎత్తుకెళ్లారు. ఆదివారం ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీలు చదువుకోవాలి

చింతలమానెపల్లి: ఆదివాసీలు అంతా చదువుకుని అక్షరాలు దిద్దాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేశ్ అన్నారు. మండలంలోని అడెపల్లిలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ చదువు లేకపోవడమే చాలా సమస్యలకు కారణమని అన్నారు. అక్షరయాత్రలో భాగంగా ఆదివాసీ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడీడు పిల్లలను పాఠశాలలకు పంపాలన్నారు. చదువే మనిషి భవిష్యత్తుకు దారి చూపుతుందని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని పలు అంశాలపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ సంతోష్ గౌడ్, కొలావార్ సంఘం గ్రామ అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం!

- పంచాయతీ నర్సరీల్లో మొక్కల పెంపకం
- మండలంలోని 26 జీపీలకు 3.38 లక్షల మొక్కల లక్ష్యం
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు



ఆసిఫాబాద్ నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. త్వరలో నిర్వహించనున్న 11వ విడత వన మహోత్సవంలో భాగంగా అధికారులు పంచాయతీ నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని 26 పంచాయతీ నర్సరీలకు ఒక్కో జీపీకి 13వేల మొక్కల చొప్పున మొత్తం 3.38 లక్షల మొక్కల పెంపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొంటున్నారు. ఇందుకోసం నర్సరీల్లో షెడ్లు ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. విత్తనాలను ఆరు నెలల క్రితమే సరఫరా చేశారు. బొప్పాయి, జామ, నిమ్మ, సీతాఫలాలు, మామిడి, నారింజ, నేరేడుతోపాటు గుల్ మోహర, వేప గానుగ, మునగ తదితర వాటిని పెంచుతున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా మొక్కలకు గ్రీన్‌షెడ్ ఏర్పాటు చేశారు. రోజు కనీసం మూడు సార్లు నీటిని అందిస్తున్నారు.

నర్సరీ మొక్కలను పల్లె ప్రకృతివనాలకు..

ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, ఆలయాల ఆవరణ, కాలవ చెరువు గట్లపై, రోడ్డు వెంట మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను పల్లె ప్రకృతివనాలకు సరఫరా చేస్తామన్నారు. ఉపాధి పథకం ద్వారా వ్యవసాయ పని లేని కూలీలకు నర్సరీల్లో మొక్కల పెంపకం ద్వారా పని దొరికింది. రోజుకు రూ.250 వరకు కూలీ పొందుతున్నారు.

మొక్కలు సిద్ధం

పంచాయతీల నర్సరీలపై అధికారుల ప్రత్యేక దృష్టిసారించాం. వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేస్తున్నాం. మూడు నెలల్లో వచ్చే జూన్ నాటికి 3.38 లక్షల మొక్కలు అందిస్తాం. నర్సరీల నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

– టి.శ్రీనివాస్, ఎంపీడీవో

పెరిగిన జొన్న సాగు

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- సాగుకు రైతుల ఆసక్తి
- మరో 15 రోజుల్లో కోతకు
- మార్కెట్‌లో వీటికి డిమాండ్



కెరమెరిలో జొన్న పంట

కెరమెరి: జొన్న..పోషకాల గని చాలామంది అంటారు. జొన్నరొట్టెలతో ఆరోగ్యానికి మేలు అని వైద్యులు చెబుతున్నారు. మండలంలోని గ్రామాల్లో రైతులు వాణిజ్య పంటలు కొంత తగ్గించి ఆహార పంటలపై దృష్టిపెడుతున్నారు. ఈ ప్రాంతంలో నల్లరేగడి భూములు జొన్న పంటకు అనుకూలంగా మారింది. బోరుబావులు అధికంగా ఉన్న రైతులు సాగు చేస్తున్నారు. మరో పక్షం రోజుల్లో కోతకు రానుంది. పెట్టుబడికి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి రావడంతో వీటి సాగుకు ఆసక్తిచూపుతున్నారు. గ్రామాల్లో పంట సాగు విస్తీర్ణం పెరిగింది. మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఉంది. క్వింటాల్ రూ.3500 నుంచి జొన్న రకాన్ని బట్టి రూ. 5500 వరకు పలుకుతుంది. పత్తి దిగుబడి రాగానే రైతులు రెండో పంటగా జొన్న సాగు చేస్తున్నారు. అదేవిధంగా కొందరు తమ చేలలో మొక్కజొన్న పండిస్తున్నారు. మార్కెట్‌లో ఒక్క కంకి కాల్చి ఇస్తే రూ.10, ఉడకబెట్టి ఇస్తే రూ. 20 తీసుకుంటున్నారు.

కెరమెరి మండలంలో..

మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉండగా 6432 మంది రైతులు ఉన్నారు. 29 వేల ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో 600 ఎకరాల్లో జొన్న, 200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

పెరిగిన రొట్టెల వాడకం

గతంలో పోల్చుకుంటే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రొట్టెల వాడకంపై పెరిగింది. దాబాలు, హోటళ్లలో అన్నం, పప్పుతోపాటు జొన్న రొట్టే కావాలంటున్నారు. వేడివేడిగా రుచిగా ఉండడంతో ఇష్టంగా ఆరగిస్తున్నారు.

మూడెకరాల్లో సాగు



మూడెకరాల్లో జొన్న, ఎకరంలో మొక్కజొన్న సాగు చేస్తున్నా. పత్తి పంట తర్వాత వీటిని పండిస్తున్నా. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుంది. జొన్న రొట్టెలతో ఆరోగ్యానికి మంచిది. ఇన్నాళ్లు జొన్నలు కొనుగోలు చేసి తినేవాళ్లం. ఇక నుంచి సొంతంగా పండించి తింటాం.

కుర్సెంగ అర్జున్, రైతు

కేసీఆర్ అభిమానికి చేయూత



టీ షాప్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభిమాని చౌహాన్ విజయ్‌కుమార్‌ను ఆర్థికంగా ఆదుకునేందుకు సొంత ఖర్చులతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్ చేయూత అందించారు. ఉట్నూర్ ఎక్స్‌రోడ్ వద్ద టీషాప్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. విజయ్ ఆర్థిక పరిస్థితిని గమనించి వారి కుటుంబానికి అండగా నిలిచి మానవత దృక్పదంతో చేయూతనందించిన మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ జాదవ్ శ్రీరామ్‌నాయక్‌ను ఆమె అభినందించారు. మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, రూప్‌దేవ్, రాథోడ్ మధుకర్, మాడవి రూప్‌దేవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: బీఆర్ఎస్ ఆవిర్భావించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి సంబురాలు జరుపుతున్నామని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద, మాన్కాపూర్, భీంపూర్, పూసిగూడ గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించి పదేళ్లు తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో విజయవంతంగా పని చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్ పార్టీయే వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, మండల కార్యదర్శి సయ్యద్‌ఖాశీం, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, ఉర్వేత రూప్‌దేవ్, తొడసం నాగోరావు, కనక ప్రభాకర్, మాడవి రూప్‌దేవ్, రాథోడ్ విష్ణు, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డు



దహెగాంలోని నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

దహెగాం: పల్లెల్లో పరిశుభ్రత కోసం ప్రతీ పంచాయతీకి గత ప్రభుత్వం లక్షల రూపాయలతో డంపింగ్ యార్డులు నిర్మించింది. ఇంటింటికి సేకరించిన తడి, పొడిచెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేయాల్సి ఉంది. గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రంలో నిర్మించిన డంపింగ్ యార్డుకు చెత్త తరలించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాణహిత కాలువ పక్కన చెత్తను పడేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయరూ..



కెరమెరి: మండలంలోని చిత్తగూడ సమీపంలో గల వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దానికి కంచె లేకపోవడంతో అటువైపు వెళ్లే పశువులు తాకి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మరకు కంచె ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

జైనూర్: మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించడంతో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కొండపటార్ గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్(70) గతేడాది నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గ్రామంలో జరగనున్న వివాహ వేడుకల సందడిలో గ్రామస్తులుండగా ఆయన శనివారం బహిర్భూమికి వెళ్తున్నట్లు కుటుంబీకులు చెప్పి వెళ్లాడు. గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు, కుటుంబీకులు సమాచారం అందించారు. వారు అతన్ని జైనూర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి

- పంట మార్పిడి చేస్తున్న గిరిజనులు
- గాదిగూడ, బేలలో అధిక సాగు
- అవగాహన కల్పిస్తున్న సీపీఎఫ్ సంస్థ



సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న మహిళా రైతు



గాదిగూడలో సాగు చేస్తున్న పెసర పంట

నార్నూర్: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతతో పాటు రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో ఏజెన్సీలో గిరిజన రైతులు పంట సాగు చేస్తున్నారు. పంట మార్పిడి చేస్తూ అధిక లాభాలను పొందుతున్నారు. సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ప్రత్యేక అవగాహన, శిక్షణ ఇచ్చి సేంద్రియ సాగుపై నమ్మకాన్ని కలిగిస్తున్నారు. గాదిగూడ మండలంలో 36, బేల మండలంలో 43 గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో రైతులు ముఖ్యంగా ఆహార పంటలు, పప్పుధాన్యాలు, జొన్న, టమాటతో పాటు ఆరు రకాల కూరగాయాలను సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందవచ్చని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 79 గ్రామాల్లో 8,000 ఎకరాల్లో రైతులు సేంద్రియ పద్ధతిలోనే వ్యవసాయం చేస్తున్నారు. రైతులకు సేంద్రియ సాగు, పంట మార్పిడిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పూర్తిగా అవగాహనతో పంటల సాగుపై దృష్టిపెట్టి వ్యవసాయంలో రాణిస్తున్నారు.

సేంద్రియ పద్ధతులు..

జీవామృతము: జీవామృతము ద్వారా పంటలను కాపాడుకోవటానికి ఎంతో ఉపయోగపడతాయి. వీటిని ఒక డ్రమ్ములో 200 లీటర్లు (సుమారుగా 15 బిందెలు) నీటిని తీసుకోవాలి. ఆవు పేడ 10 కిలోలు, ఆవు మూత్రం 10 లీటర్లు, పప్పు దినుసులు పిండి 2 కిలోలు, బెల్లం 2 కిలోలు, గట్టు, పుట్ట మట్టి గుప్పెడు తీసుకొని కలపాలి. ఒక ఎకరం పంటపై పిచికారీ చేసుకోవాలి.

నీమాస్త్రం: రసం పీల్చే పురుగులను నివారించేందుకు నీమాస్త్రం పంటపై ఉపయోగిస్తారు. నీరు 200 లీటర్లు, వేప ఆకులు, రెమ్మలు, చిగుర్లు 10 కిలోలు, ఆవుపేడ 2 కిలోలు, ఆవు మూత్రం 10 లీటర్లు పదార్థాలు కావాల్సి ఉంటుంది. 10 కిలోల వేపాకును మెత్తగా రుబ్బి 200 లీటర్ల నీటిలో (ప్లాస్టిక్ డ్రమ్, ఇనుప డ్రమ్, సిమెంట్ డ్రమ్, మట్టి డ్రమ్) కలపాలి. 48 గంటల వరకు మూసి ఉంచాలి. మరుసటి రోజు మూడుసార్లు కర్రతో కలిపాలి. తరువాత పలచని గడ్డతో వడగట్టాలి. నీమాస్త్రం తయారు అవుతుంది. ఇలా తయారైనా నీమాస్త్రం మూడు నెలల వరకు నిల్వ ఉంటుంది. పంటలపై పొద్దున, సాయంత్రం పిచికారీ చేయాలి. పంట విత్తిన 20 రోజులకు, 45 రోజులకు, 60 రోజులకు మూడుసార్లు పిచికారీ చేయాలి.

అగ్ని అస్త్రం: అగ్నిఅస్త్రంను ఆవు మూత్రం 10 లీటర్లు, పొగాకు ఆకులు 1 కిలోలు, వెల్లులి 1/2 కిలో, పచ్చిమిర్చి–1/2కిలోలు, మూడు కిలోలు వేపా ఆకుల పేస్ట్ తయారు చేయడానికి వాడుతారు. ఒక పాత్రలో ఆవు మూత్రం తీసుకొని ఇందులో విడివిడిగా దంచిన వేప ఆకులు పొగాకు వెల్లులి, పిచ్చిమిర్చి ముద్దలను బాగా కలపాలి. పాత్రపైన మూతపెట్టి 5 సార్లు పొంగు వచ్చే విధముగా ఉడికించాలి. రెండు రోజుల పాటు చల్లరానిచ్చి బట్టతో వడగట్టాలి. ఈ అగ్నిఅస్త్రాన్ని మూడు నెలల వరకు నిల్వ ఉంచి వాడుకోవచ్చు. ఈరకంగా సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు.

మంచి దిగుబడి వస్తోంది



సేంద్రియ పద్ధతిలో పంట సాగు చేస్తున్నా.. మంచి దిగుబడి వస్తోంది. రసాయన ఎరువులను అసలే వాడడం లేదు. ఐదు ఎకరాల్లో జొన్న సాగు చేస్తున్నా. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

– కొడప కన్ను, రైతు, గాదిగూడ

కూరగాయలు సాగు చేస్తున్న



సేంద్రియ పద్ధతి ద్వారా కూరగాయలు సాగు చేస్తున్నా. మంచి లాభం ఉంది. సీపీఎఫ్ సంస్థ సహకారంతో సాగు చేస్తున్నాం. సేంద్రియ పద్ధతి ద్వారా ఎరువులు, పిచికారీ మందులు స్వయంగా తయారు చేసుకుంటాం. ఎకరానికి మంచి దిగుబడి ఉంది.

– భీంబాయి, మహిళా రైతు

అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు సేంద్రియ సాగు పై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు మొ త్తం 79 గ్రామాల్లో దాదాపు 8,000 ఎకరాల్లో సేంద్రియ పద్ధతి ద్వారా పంట సాగు చేస్తున్నారు.

– రాథోడ్ దిలీప్, సీపీఎఫ్ సంస్థ ప్రోగ్రాం అధికారి

పల్లె ప్రకృతివనంలో మంటలు



చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా శివారులో కార్చిచ్చు అంటుకుంది. గ్రామ సమీపంలోని అడెపల్లి చౌరస్తా సమీపంలో అటవీ ప్రాంతం ఉంది. డబ్బా పల్లె ప్రకృతివనంలో ఆదివారం మంటలు అంటుకున్నాయి. ప్రకృతివనంలోని మొక్కలు, చెట్లు కాలిపోయాయి. వనం పక్కన రహదారి వైపు మంటలు వ్యాపించాయి. కొద్దిసేపటికి మంటలు అదుపులోకి వచ్చాయి. పల్లె ప్రకృతివనం కాలిపోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

గుండెపోటుతో యువతి మృతి



ప్రత్యూష (ఫైల్)

కౌటాల: మండలంలోని కనికి గ్రామానికి చెందిన ప్రత్యుష (24) గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జుల్మి రఘు–లత దంపతుల కుమార్తె ప్రత్యుష డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో తన అక్క దివ్యతో కలిసి ఉంటోంది. ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. ఈక్రమంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో ఒక్కసారి ప్రత్యూష తనకు ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో అక్క వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించింది. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. విషయం తెలియడంతో కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. మృతురాలికి అక్క దివ్య, తమ్ముడు శివప్రసాద్ ఉన్నారు.